సాక్షి
యాదాద్రి భువనగిరి

సోమవారం । 16 । జూన్ । 2025



విచారణ చేయించాలి
గంధమల్ల రవి ఆత్మహత్యపై పోలీసు ఉన్నత అధికారులతో విచారణ చేయించాలని మహేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. - 8లో



దక్షిణద్వారం నుంచి బయటకు..
యాదగిరీశుడిని దర్శించుకున్న భక్తులు దక్షిణ ద్వారం నుంచి బయటకు వచ్చేలా అధికారులు ఏర్పాట్లు చేశారు. - 8లో



సాగుకు సమాయత్తం
భూదాన్‌పోచంపల్లి మండలంలోని మూసీ ఆయకట్టులో వానాకాలం సాగుకు రైతులు సమాయత్తం అవుతున్నారు. - 9లో

న్యూస్‌రీల్

స్వర్ణగిరిలో గిరిప్రదక్షిణ



ప్రదక్షిణ చేస్తున్న భక్తులు

భువనగిరి: పట్టణ పరిధిలోని స్వర్ణగిరి క్షేత్రంలో గల శ్రీ వెంకటేశ్వరస్వామి దేవాలయం వద్ద ఆదివారం శ్రావణ నక్షత్రం సందర్భంగా భక్తులు గిరిప్రదక్షిణ చేశారు. అంతకుముందు ఆలయంలో స్వామివారికి సుప్రభాత సేవ, తోమాల సేవ, సహస్రనామార్చన, నిత్యకల్యాణం నిర్వహించారు. మధ్యాహ్నం సుమారు 4వేల మంది భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. సాయంత్రం తిరువీధిఉత్సవ సేవ, రథోత్సవం నిర్వహించారు.

పద్మ పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

భువనగిరి : దేశంలో అత్యున్నతమైన పద్మ పురస్కారాలకు కేంద్ర ప్రభుత్వం దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. కళలు, సాహిత్యం, విద్య, క్రీడలు, వైద్యం, సామాజిక సేవ, సైన్స్, ఇంజనీరింగ్, పబ్లిక్ అఫైర్స్, సివిల్ సర్వీస్, వాణిజ్యం, పరిశ్రమలు మొదలైన రంగాల్లోవిశిష్ట సేవలు అందించి విజయాలు సాధించిన వారికి వచ్చే ఏడాది గణతంత్ర దినోత్సవం రోజు అవార్డులు అందజేయనున్నారు. 2026 సంవత్సరానికి ఇచ్చే పద్మ పురస్కారాల కోసం నామినేషన్లు, సిఫారసులను రాష్ట్రపతి పురస్కార్ పోర్టల్ http://awards.gov.in ద్వారా జులై 31 లోగా పంపాల్సి ఉంటుంది. పూర్తి వివరాలకు పద్మ అవార్డుల వెబ్‌సైట్ http://padmaawards.gov.inలో ఉన్నాయి.

కల్నల్ సంతోష్‌బాబు త్యాగం వెలకట్టలేనిది



కల్నల్ సంతోష్‌బాబు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎస్పీ నరసింహ

సూర్యాపేటటౌన్ : దేశం కోసం కల్నల్ సంతోష్‌బాబు చేసిన ప్రాణత్యాగం వెలకట్టలేనిదని సూర్యాపేట జిల్లా ఎస్పీ నరసింహ అన్నారు. ఆదివారం కల్నల్ సంతోష్‌బాబు వర్ధంతి సందర్భంగా సూర్యాపేటలోని సంతోష్‌బాబు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఆర్మీ జవాన్‌గా వీరోచితంగా పోరాడి దేశ రక్షణలో అసువులు బాసిన సంతోష్‌బాబును నేటి యువత స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలన్నారు. కల్నల్ సంతోష్‌బాబు గారి త్యాగాన్ని స్మరించుకోవడం ఆ కుటుంబానికి ఓదార్పన్నారు. కార్యక్రమంలో సంతోష్‌బాబు కుటుంబ సభ్యులు, ఆర్మీ అధికారులు, ఆర్మీ జవాన్లు పాల్గొన్నారు.

నృసింహుడి క్షేత్రంలో కోలాహలం

యాదగిరిగుట్ట: యాదగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో నిత్యారాధనలు, వేలాదిగా తరలివచ్చిన భక్తులతో కోలాహలం నెలకొంది. ఆదివారం వేకువజామున ఆలయాన్ని తెరిచిన అర్చకులు.. స్వామివారి మేల్కొలుపులో భాగంగా సుప్రభాత సేవ చేపట్టారు. అనంతరం గర్భాలయంలోని స్వయంభూ, ప్రతిష్ఠా అలంకారమూర్తులకు అభిషేకం, అర్చనలతో కొలిచారు. ప్రథమ ప్రాకార మండపంలో శ్రీసుదర్శన నారసింహ హోమం, గజవాహనసేవ, స్వామి, అమ్మవారికి నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం తదితర పూజలు గావించారు. ముఖ మండపంలో సువర్ణ పుష్పార్చనమూర్తులకు అష్టోత్తర పూజలు చేపట్టారు. సాయంత్రం ఆలయంలో వెండి జోడు సేవను భక్తుల మధ్య ఊరేగించారు. ఆయా వేడుకల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.



సుదర్శన నారసింహ హోమం నిర్వహిస్తున్న అర్చకులు



ఆలయ మాడ వీధుల్లో భక్తజన సందోహం

గడువులోపు సాధ్యమేనా!

పంట సీజన్‌లో బునాదిగాని కాల్వ విస్తరణ



మక్తా అనంతారం సమీపంలో కొనసాగుతున్న బునాదిగాని కాల్వ పూడికతీత పనులు

- తొలి దశలో ఐదు కిలో మీటర్లు..
- జూలై 10వ తేదీలోపు పనులు పూర్తి చేసి రైతులకు నీరివ్వాలని నిర్ణయం
- 25 రోజులు గడిచినా అర కిలో మీటరు దూరమే పూర్తి
- సకాలంలో నీటి విడుదలపై సందేహాలు
- క్రాప్‌హాలిడే ప్రకటిస్తారన్న ప్రచారం

బీబీనగర్: జిల్లాలో ప్రధాన సాగునీటి వనరుగా ఉన్న బునాదిగాని కాల్వ విస్తరణ పనులు ఎట్టకేలకు మొదలయ్యాయి. పనుల నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం రూ.266.69 కోట్లు విడుదల చేసింది. 98 కిలో మీటర్లకు గాను.. తొలి దశలో బీబీనగర్ మండల పరిధిలోని మక్తా అనంతారం నుంచి ఎర్రకుంట వరకు ఐదు కిలో మీటర్ల మేర కాల్వ పనులు జూలై 10 లోపు పూర్తి చేసి సాగు నీరు విడుదల చేయాలని నిర్ణయించింది. అంత వరకు బాగానే ఉన్నా పనులు జరుగుతున్న తీరు చూస్తుంటే అనుకున్న తేదీకి పూర్తయ్యేనా అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. వర్షాల వల్ల కాలువలో పూడికతీత సమయంలో నీటి ఊట వస్తుండటం ఇబ్బందికరంగా మారింది. ఫలితంగా పనులు మొదలై 25 రోజులు గడిచినా అర కిలో మీటరు దూరమే పూర్తయ్యాయి.

98కిలో మీటర్ల మేర జరుగనున్న విస్తరణ

బీబీనగర్ మండల పరిధిలోని మక్తా అనంతారం శివారులో మేడ్చల్ – యాదాద్రి జిల్లా సరిహద్దులోని మూసీ నుంచి అడ్డగూడూరు మండలం ధర్మారం చెరువు వరకు 98 కిలో మీటర్లు బునాది కాల్వను విస్తరించనున్నారు. ప్రస్తుతం ఉన్న కాల్వ సరిగా లేకపోవడంతో ఎగువ ప్రాంతానికి నీరు వెళ్లని పరిస్థితి నెలకొంది. బీబీనగర్, భువనగిరి మండలాల పరిధిలోని భూములకు మాత్రమే నీరందుతుంది. మొదటి దశలో 5 కిలో మీటర్ల మేర కాల్వను ఆధునీకరించి పంటలకు నీటిని విడుదల చేస్తామని అధికారులు చెప్పుకొస్తున్నారు.

పనులకు ఆటంకం

కాల్వ పనులను మొదలు పెట్టి 25 రోజులు గడిచినా ఇంకా 500 మీటర్ల మేర మాత్రమే పనులు పూర్తయ్యాయి. మక్తా అనంతారం వద్ద కాల్వ పూడిక తీత, సిమెంట్ కాంక్రీట్ బెడ్ పనులు జరిగాయి. ఇంకా నాలుగున్నర కిలో మీటర్ల మేర పనులు జరగాల్సి వుంది. జూలై 10న నీటిని విడుదల చేస్తామని అధికారులు చెబుతున్నా గడువులోపు మొదటి దశ పనులు పూర్తిస్థాయిలో జరిగేలా కనిపించడం లేదు. అడుగు భాగంలో 66 మీటర్లు, పైభాగంలో 30 మీటర్ల వెడల్పుతో కాల్వను విస్తరిస్తున్నారు.కాల్వ పూడిక తీసేటప్పుడు నీరు ఊరుతుండడంతో పనులకు ఆటంకం ఏర్పడుతుంది.

సకాలంలో నీటిని వదలాలి



బునాదిగాని కాల్వ విస్తరణ మొదటి దశ పనులను త్వరగా పూర్తిచేసి అధికారులు చెబుతున్నట్టుగా జూలై 10వ తేదీ వరకు కాల్వ ద్వారా నీటిని విడుదల చేయాలి. నాకున్న ఎకరం పొలంతో పాటు కౌలుకు తీసుకున్న 10 ఎకరాలు బునాదిగాని కాల్వ నీటి ద్వారానే సాగు చేస్తాను. క్రాప్‌హాలిడే ప్రకటిస్తే రైతులంతా నష్టపోతాం. సకాలంలో పనులు పూర్తి చేసి కాల్వకు నీటిని విడుదల చేసేలా అధికారులు చర్యలు చేపట్టాలి.

– జక్కి సంతోష్, రైతు, రాఘవాపురం

జూలై 10న నీటి విడుదల

కాల్వ విస్తరణ పనులు కొనసాగుతున్నాయి. ప్రధానంగా కాల్వ కట్టలు తెగిన చోట, క్రాసింగ్‌లను గుర్తించి పూడిక తీత, సిమెంట్ కాంక్రీట్ బెడ్ పనులు చేపడుతున్నాయం. మొదటి దశలో 5 కిలో మీటర్ల మేర కాల్వ విస్తరణ పనులను జూలై 10లోపు పూర్తి చేసి సాగు నీటిని విడుదల చేస్తాం.

– భరత్‌కుమార్, ఇరిగేషన్ ఏఈ

క్రాప్‌హాలిడే తప్పదా?

పనులు జరుగుతున్న తీరు చూస్తుంటే వానాకాలం సీజన్ ఆయకట్టులో క్రాప్‌హాలిడే ప్రకటించే అవకాశం కనిపిస్తుంది. 98 కిలో మీటర్ల మేర పనులు జరగాల్సి ఉన్నందున ఇంకా 500 మీటర్ల మేర మాత్రమే పూర్తయ్యాయి. క్రాప్‌హాలిడే ప్రకటించకపోతే పనులు ముందుకు సాగే పరిస్థితి ఉండదు. దీంతో ఆయకట్టు రైతులకు అవగాహన కల్పించడంతో పాటు భూ సేకరణ విషయంలో నచ్చజెప్పి సర్వే చేపట్టడంలో ఆటంకాలు లేకుండా చర్యలు తీసుకునేలా అధికారులు నిర్ణయించినట్లు సమాచారం. క్రాప్‌హాలిడే ప్రకటిస్తే మండల పరిధిలోని 300కు పైగా రైతు కుటుంబాలపై ప్రభావం చూపడంతో పాటు 500 ఎకరాలకు పైగా సాగు పనులు నిలిచిపోనున్నాయి.



కాల్వను విస్తరించి సిమెంట్ కాంక్రీట్ బెడ్ వేసిన దృశ్యం

రైతునేస్తం.. సాగుకు ఊతం

నేడు రైతులతో సీఎం ముఖాముఖి

- 51 రైతునేస్తం కేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తి
- పాల్గొననున్న 12,750 మంది రైతులు



మాస్‌కుంట రైతువేదికలో వీడియో కాన్ఫరెన్స్ సెట్‌ను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి

భువనగిరిటౌన్, రామన్నపేట : వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడమే లక్ష్యంగా రైతులకు సలహాలు, సూచనలిచ్చేందుకు సోమవారం నిర్వహించే ×రైతు నేస్తం¥ కార్యక్రమానికి రైతునేస్తం కేంద్రాలు రెడీ అయ్యాయి. ఆచార్య జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో రైతునేస్తం కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై రాష్ట్ర వ్యాప్తంగా రైతు వేదికలకు వచ్చిన రైతులతో ముఖాముఖి మాట్లాడనున్నారు. కార్యక్రమాన్ని ప్రత్యక్షంగా వీక్షించేందుకు రైతునేస్తం కేంద్రాల్లో ఏర్పాట్లు చేశారు. గతంలో 17 రైతువేదికల్లో మాత్రమే రైతునేస్తం కార్యక్రమం ప్రసారం అయ్యేది. తాజాగా మరో 34 రైతువేదికలకు పెంచారు. ప్రతి మండలంలో మూడు రైతువేదికల చొప్పున ఎంపిక చేసి రైతునేస్తం కార్యక్రమానికి సిద్ధం చేశారు.

పాల్గొననున్న ఎమ్మెల్యేలు

సీఎం పాల్గొనే రైతునేస్తం కార్యక్రమాన్ని ఎమ్మెల్యేలు వీక్షించనున్నారు. ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య యాదగిరిగుట్ట మండలం మాసాయిపేట రైతువేదిక, కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి భువనగిరి శివారులోని రైతువేదిక, మందుల సామేల్ మోత్కూరు మండలం పాటిమట్ల రైతువేదికలో పాల్గొంటారు.

ఒక్కో రైతువేదికలో 250 నుంచి 300 మంది రైతులు హాజరు

జిల్లా వ్యాప్తంగా 51 రైతువేదికల్లో 1,2750 మంది రైతులు హాజరుకానున్నారు. ఒక్కో వేదికలో 250 నుంచి 300మంది రైతులు కూర్చునేందుకు వీలుగా ఏర్పాట్లు చేశారు. రైతునేస్తం కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ఆయా గ్రామాల్లో రైతులకు ఇప్పటికే సమాచారం ఇవ్వడం, డప్పు చాటింపు వంటివి చేశారు.

సందేహాలను నివృత్తి చేసుకోవచ్చు



వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోంది. ఇందులో భాగంగా రైతులకు మెరుగైన సాగు విధానాలపై సలహాలు, సూచనలు ఇచ్చేందుకు రైతునేస్తం కార్యక్రమం నిర్వహిస్తుంది. రైతులకు ఈ కార్యక్రమం ద్వారా వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలతో నేరుగా మాట్లాడే అవకాశం ఏర్పడుతుంది. సాగు విధానాలపై తమ సందేహాలను నివృత్తి చేసుకోవచ్చు.

– సిరిగిరెడ్డి మల్లారెడ్డి, వలిగొండ మార్కెట్ వైస్ చైర్మన్

రైతుల బాగుకే రైతునేస్తం



రైతునేస్తం కార్యక్రమం రైతులకు గొప్ప అవకాశం. వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు రైతులతో ముఖాముఖి చర్చించి సాగు పద్ధతులతో తెలియజేయడంతో పాటు వారి సందేహాలను నివృత్తి చేస్తారు. రైతునేస్తం కార్యక్రమం ద్వారా అభ్యుదయ రైతుల అనుభవాలు చూడడం వల్ల రైతుల్లో వ్యవసాయంపై నమ్మకం పెరుగుతుంది. జిల్లాలో అదనంగా 34 రైతువేదికల్లో సోమవారం నుంచి రైతునేస్తం సేవలు అందుబాటులోకి వస్తాయి. మధ్యాహ్నం 3 గంటలకు సీఎం రేవంత్‌రెడ్డి జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో రైతునేస్తం కార్యక్రమాన్ని ప్రారంభించి రైతులను ఉద్దేశించి ప్రసంగిస్తారు. ప్రజాప్రతినిధులు, రైతులు రైతునేస్తం కార్యక్రమంలో పాల్గొనాలి.

– గోపాల్, జిల్లా వ్యవసాయ అధికారి

16 నుంచి ఎంపిక పోటీలు

భువనగిరి: రాష్ట్రంలోని క్రీడా పాఠశాలల్లో 2025–26 విద్యా సంవత్సరంలో నాలుగో తరగతిలో ప్రవేశాలకు ఈనెల 16నుంచి 19వ తేదీ మధ్యలో ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి ధనుంజయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా వ్యాప్తంగా అన్ని మండల కేంద్రాల్లో ఎంపిక చేసిన ప్రభుత్వ పాఠశాలల్లో ఉంటాయన్నారు. 30 మీటర్ల ఫ్లయింగ్ స్టార్ట్, స్టాండింగ్ బ్రాడ్ జంప్, 800 మీటర్స్ రన్నింగ్, 6.10 మీటర్ల షటిల్ రన్, మెడిసిన్ బాల్‌త్రో (కిలో బరువు), వర్టికల్ జంప్, ఫ్లెక్సిబులిటీ మరియు మెడికల్ టెస్ట్ నిర్వహిస్తారని పేర్కొన్నారు. పోటీల్లో పాల్గొనే విద్యార్థులు 2016 నవంబర్ 1నుంచి 2017 ఆగస్టు 31 మధ్య జన్మించి ఉండాలన్నారు.

మల్లాపురంలో హైడ్రామా

- మెడికల్ కళాశాల మల్లాపురంలోనే ఏర్పాటు చేయాలని యాదగిరిగుట్ట బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కర్రె వెంకటయ్య ఆమరణ దీక్ష
- భగ్నం చేసి వలిగొండ స్టేషన్‌కు తరలింపు
- పోలీసుల తీరును నిరసిస్తూ గుట్టలో బీఆర్‌ఎస్ శ్రేణుల ఆందోళన, ఉద్రిక్తత



ఆమరణ దీక్ష చేస్తున్న కర్రె వెంకటయ్యను అరెస్టు చేసి తీసుకెళ్తున్న పోలీసులు

యాదగిరిగుట్ట రూరల్: యాదగిరిగుట్ట మండలం మల్లాపురంలో హైడ్రామా చోటు చేసుకుంది. మెడికల్ కళాశాలను మల్లాపురంలోనే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్‌ఎస్ యాదగిరిగుట్ట మండల శాఖ అధ్యక్షుడు, మల్లాపురం మాజీ సర్పంచ్ కర్రె వెంకటయ్య ఆదివారం మల్లాపురం గ్రామ పంచాయతీ ఆవరణలో ఆమరణ నిరాహార దీక్ష చేపట్టారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం హయాంలో మాజీ ప్రభుత్వ విప్ గొంగిడి సునీత కృషి వల్ల మెడికల్ కళాశాల మంజూరైందని, మల్లాపురంలోని సర్వే నంబర్ 64 భూముల్లో నిర్మాణం చేసేందుకు నాటి సీఎం కేసీఆర్ జీఓ ఇచ్చారని గుర్తు చేశారు. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం కళాశాలను మల్లాపురంలో కాకుండా వేరే చోటకు తరలించాలని నిర్ణయించడం సమంజసం కాదన్నారు. మల్లాపురంలో మెడికల్ కాలేజీ ఏర్పాటు చేస్తే ఈ ప్రాంతం అభివృద్ధి చెంది ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. కళాశాల, గ్రామ ప్రజల బాగు కోసం తాను ప్రాణత్యాగానికైనా సిద్ధమని, గత ప్రభుత్వం కేటాయించిన ప్రాంతంలోనే మెడికల్ కాలేజీ నిర్మాణం జరగాలన్నారు. ఈ కార్యక్రమంలో యాదగిరిగుట్ట పీఏసీఎస్ చైర్మన్ ఇమ్మడి రాంరెడ్డి, ఆలేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గడ్డమీది రవీందర్ గౌడ్, మాజీ జెడ్పీటీసీ తోటకూరి అనురాధ, పల్లెపాటి మాధవులు, బరిగె నర్సింహులు, మెటె శేఖర్, బీఆర్‌ఎస్ నాయకులు గ్రామస్తులు పాల్గొన్నారు.

దీక్షను భగ్నం చేసిన పోలీసులు

వెంకటయ్య ఆమరణ దీక్షకు దిగిన కొన్ని గంటల్లోనే యాదగిరిగుట్ట ఏసీపీ శ్రీనివాస్‌నాయుడు ఆధ్వర్యంలో పోలీసులు మల్లాపురం చేరుకున్నారు. వెంకటయ్యను బలవంతంగా అదుపులోకి తీసుకుని వలిగొండ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఆయనతో పాటు మరికొందరిని స్టేషన్‌కు తరలించారు. గ్రామస్తులు, బీఆర్‌ఎస్ శ్రేణులు అడ్డుకోబోగా ఉద్రిక్తత నెలకొంది.

గుట్టలో బీఆర్‌ఎస్ శ్రేణుల ధర్నా, అరెస్ట్

యాదగిరిగుట్ట: బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కర్రె వెంకటయ్య అరెస్టును నిరసిస్తూ మల్లాపురం గ్రామస్తులు, మండలం, పట్టణ బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు యాదగిరిగుట్టలోని ప్రధాన రహదారిపై ఆందోళనకు దిగారు. తమ నాయకుడిని ఎక్కడికి తీసుకెళ్లారో చెప్పాలని గడ్డమీది రవీందర్‌గౌడ్, పాపట్ల నరహరి, మాజీ జెడ్పీటీసీ కర్రె కమలమ్మ తదితర నాయకులు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. వెంకటయ్యకు ఎలాంటి ఇబ్బంది ఉండదని, క్షేమంగా అప్పగిస్తామని సీఐ భాస్కర్ వారికి చెప్పినా వినిపించుకోలేదు. దీంతో పోలీసుల అదుపులో ఉన్న కర్రె వెంకటయ్యతో పాటు ఆలేరు మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతతో మాట్లాడించడంతో వారు ఆందోళన విరమించారు.



గుట్టలో ఆందోళన చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

వలిగొండలో గొంగిడి సునీత నిరసన

వలిగొండ : కర్రె వెంకటయ్యను వలిగొండ పోలీస్‌స్టేషన్ తరలించారన్న సమాచారంతో ఆలేరు మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత అక్కడికి చేరుకున్నారు. పార్టీ నాయకులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. శాంతియుతంగా ఆమరణ దీక్ష చేస్తున్న వెంకటయ్యను పోలీసులు అక్రమంగా అరెస్టు చేసి రహస్యంగా వలిగొండ పోలీస్ స్టేషన్‌కు తరలించడాన్ని ఆమె ఖండించారు. మెడికల్ కాలేజీని కాపాడుకునేందుకు శాంతియుతంగా దీక్ష చేపట్టగా పోలీసులు అడ్డుకోవడం అప్రజాస్వామికమన్నారు. మెడికల్ కళాశాలను దాతర్‌పల్లికి తరలించే యోచనను ప్రభుత్వం విరమించుకోవాలన్నారు. మల్లాపురంలోనే వైద్యకాలేజీ ఏర్పాటు చేస్తామని, వైద్యారోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి, కలెక్టర్, డీఎంహెచ్‌ఓ ఎవరైనా హామీ ఇచ్చే వరకు వెంకటయ్య దీక్ష కొనసాగుతుందన్నారు.



వలిగొండ పోలీస్ స్టేషన్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే సునీత

కేటీఆర్, హరీష్‌రావు ఆరా..

కర్రె వెంకటయ్య ఆమరణ దీక్ష సందర్భంగా చోటు చేసుకున్న పరిణామాలపై మాజీ మంత్రులు కేటీఆర్, హరీష్‌రావు ఆరా తీశారు. గొంగిడి సునీతకు ఫోన్ చేసి తెలుసుకున్నారు.

గ్రామాల్లో గంజాయి ఘాటు

గుట్టుగా విక్రయాలు

- ఇంటర్, డిగ్రీ విద్యార్థులే టార్గెట్
- రోడ్లు, రైలు మార్గాల ద్వారా జిల్లాకు
- అక్కడి నుంచి ద్విచక్రవాహనాలపై పల్లెలకు చేరవేస్తున్న అక్రమార్కులు

యాదగిరిగుట్ట రూరల్: పట్టణాలకే పరిమితమైన గంజాయి..పల్లెలకూ పాకింది. ఇంటర్, డిగ్రీ విద్యార్థులే లక్ష్యంగా గంజాయి మాఫియా వ్యాపారం చేస్తోంది. నాగపూర్, ఆంధ్రా, ఒడిశా, హైదరాబాద్, వరంగల్ ప్రాంతాల నుంచి గ్రామీణ ప్రాంతాలకు తరలిస్తోంది. దీంతో గంజాయి వాడకం విచ్చలవిడిగా పెరిగిపోతోంది. విద్యార్థులు, యువకులు నిర్మానుష్య ప్రాంతాలు, నిరుపయోగంగా భవనాలను అడ్డాగా చేసుకుని గంజాయి సేవిస్తున్నారు. ఇటీవల యాదగిరిగుట్ట మండలంలో చోటు చేసుకున్న ఘటనలు కలవర పరుస్తున్నాయి. ఎస్‌ఓటీ పోలీసులకు పట్టుబడిన వ్యక్తులంతా యువకులే కావడం ఆందోళన కలిగిస్తోంది.

ఇటీవల చోటు చేసుకున్న ఘటనలు

- యాదగిరిగుట్ట మండలంలోని ఓ గ్రామంలో కొందరు యువకులు ఇతర ప్రాంతాల నుంచి గంజాయి తీసుకువచ్చి రహస్య ప్రాంతంలో సేవిస్తుండగా ఎస్‌ఓటీ పోలీసులు పట్టుకున్నారు. వారి వద్ద నుంచి 150 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచారు.
- యాదగిరిగుట్ట పట్టణ పరిధిలో ఓ వ్యక్తి వద్ద పోలీసులకు గంజాయి లభించింది.
- భువనగిరి బస్టాండ్‌లో ఇద్దరు వ్యక్తులు గంజాయి అమ్ముతూ ఎక్సైజ్ పోలీసులకు పట్టుబడ్డారు. వారి వద్ద నుంచి కిలోన్నర గంజాయి, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.



యాదగిరిగుట్ట మండలంలోని ఓ గ్రామంలో గంజాయి సేవించడానికి ఉపయోగించిన బాటిల్

- హైదరాబాద్ నుంచి ఆలేరుకు గంజాయి తరలిస్తున్న యువకుడిని ఎస్‌ఓటీ పోలీసులు పట్టుకున్నారు. అతని వద్ద 160 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకుని కేసును నమోదు చేశారు.
- భువనగిరిలో ఓ వ్యక్తి బైక్‌పై గంజాయి తీసుకెళ్తూ పోలీసుల తనిఖీల్లో పట్టుబడ్డాడు.అతని వద్ద నుంచి 100 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. ఇలా వెలుగులోకి రాని ఘటనలు మరెన్నో ఉన్నాయి.

ఈ ప్రాంతాల నుంచి గంజాయి రవాణా..

రాష్ట్రంలోని పలు పట్టణాలతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి జిల్లాకు గంజాయి రవాణా జరుగుతోంది. ప్రధానంగా నాగాపూర్, ఆంధ్రా ఒడిశా బార్డర్, హైదరాబాద్, వరంగల్ ప్రాంతాల నుంచి రోడ్డు, రైలు మార్గాల్లో గంజాయి తీసుకువచ్చి రహస్య ప్రాంతాల్లో డంప్ చేస్తున్నారు. వాటిని ప్యాకెట్లు చేసి యువతకు విక్రయిస్తున్నారు. ఒక్కో ప్యాకెట్ రూ.500 నుంచి రూ.1000, పావు కిలో రూ.3,500, అర కిలో రూ.6,500, కిలో రూ.1,3000 వరకు విక్రయిస్తున్నారు.

పల్లెల్లో నిఘా ఉంచాం



గంజాయి, డ్రగ్స్ వంటి మత్తుపదార్థాలు విస్తరించకుండా చర్యలు తీసుకుంటున్నాం. ప్రధానంగా టోల్‌ప్లాజాలు, ప్రతి బస్టాండ్, రైల్వే స్టేషన్‌ల వద్ద నిఘా ఉంచాం. యువత మత్తు పదార్థాలకు అలవాటు పడకుండా సదస్సులు ఏర్పాటు చేసి దుష్పరిణామాలపై అవగాహన కల్పిస్తున్నాం. తల్లిదండ్రులు కూడా తమ పిల్లల కదలికలపై కన్నేసి ఉంచాలి.

– కృష్ణమూర్తి, ఎక్సైజ్ సూపరింటెండెంట్

తల్లిదండ్రుల పర్యవేక్షణ తప్పనిసరి



యువత మత్తుపదార్థాలకు అలవాటు పడి భవిష్యత్ నాశనం చేసుకోవద్దు. గంజాయి అమ్మినా, సేవించినా కఠిన చర్యలుంటాయి. పల్లెలపైనా నిఘా ఉంచాం. ఎవరైనా విద్యార్థులు, యువకులు మత్తుపదార్థాలకు బానిసలై ఉంటే మా దృష్టికి తీసుకవస్తే వారికి కౌన్సిలింగ్ ఇస్తాం. పిల్లలు ఎక్కడికెళ్తున్నారు, ఏం చేస్తున్నారో తల్లిదండ్రుల పర్యవేక్షణ ఉండాలి.

– భాస్కర్, యాదగిరిగుట్ట ఎస్‌హెచ్‌ఓ

ఫలించిన భగీరథ ప్రయత్నం

- తనకున్న భూమిలో ఇంకుడు గుంతలు, కందకాలు తవ్వించిన రైతు
- తోటలకు, పంటల సాగుకు పుష్కలంగా లభ్యమవుతున్న నీరు



ఎకరం విస్తీర్ణంలో తీయించిన నీటి గుంత



వాన నీరు ప్రవహించేలా తవ్వించిన కందకాలు

చండూరు: జియాలజిస్టులు సైతం పరిశీలించి ఆ భూమిలో ఎక్కడ బోరు వేసినా చుక్క నీరు పడదని తేల్చేశారు. అయినా ఆ రైతు తన భగీరథ ప్రయత్నం ఆపలేదు. తన భూమి చుట్టూ కందకాలు, ఇంకుడు గుంతలు తవ్వించి.. చుక్క నీరు పడదని తేల్చిన చోట ఎక్కడ చూసినా గంగ ఉబికి వచ్చేలా మార్చాడు చండూరు మండల పరిధిలోని బంగారిగడ్డ గ్రామానికి చెందిన రైతు పాల్వాయి సత్యనారాయణరెడ్డి. వర్షపు నీరు భూమిలోనే ఇంకిపోయేలా సత్యనారాయణరెడ్డి తనకున్న దాదాపు 100 ఎకరాల్లో ఆరేళ్ల క్రితమే కందకాలు తవ్వించారు. 2 సంవత్సరాల క్రితం మళ్లీ ఆ కాలువల్లో పూడిక తీయించారు. గొల్లగూడ గ్రామానికి వెళ్లే దారిలో గల 50 ఎకరాల్లో ఒక్కోటి ఎకరం విస్తీర్ణంలో 4ఎకరాల్లో వేర్వేరుచోట్ల ఫాంపాండ్ లాంటి నీటి గుంతలను తవ్వించారు. దీంతో 50 ఎకరాల్లో పడిన ప్రతి వాన చినుకు భూమిలోకి ఇంకగా.. మిగిలిన నీరు కందకాల ద్వారా ఇంకుడు గుంతల్లోకి, ఫాంపాండ్‌లలోకి చేరేలా ఏర్పాటు చేశారు. ఇప్పటికీ ఎండాకాలంలో కూడా రెండు గుంతల్లో నీరు అలానే ఉంది. దీని ద్వారా వస్తున్న నీటి లభ్యత, భూగర్భ జలాలతో మిగిలిన 46 ఎకరాల్లో మామిడి, సపోట, కొబ్బరి, సీతాఫలం, నిమ్మ తోటలతో పాటు జొన్న సాగు చేస్తున్నారు. అంతర పంటలుగా టమాట, ఖర్బూజ, బూడిద గుమ్మడి కాయ, దోసకాయ, బీరకాయ పండిస్తున్నారు. అంతేగాక వందల్లో వేప, యూకలిప్టస్, కానుగ చెట్లు పెంచుతున్నారు. ఇంకుడు గుంతలు, కందకాలు తవ్వించే విషయంలో రైతులకు ఆసక్తి పెరుగుతూ వస్తుంది. ఈ ఒక్క సంవత్సరమే చండూరు మండలంలో దాదాపు 50 మందికి పైగా రైతులు ఉపాధి హామీ పథకం ద్వారా ఇంకుడు గుంతలు, కందకాలు తవ్వించుకున్నారు. ఇది ఇలాగే కొనసాగితే భవిష్యత్తులో భూగర్భ జలాలకు కొదవ ఉండదనేది నిపుణుల అభిప్రాయం.

వాన నీటిని ఒడిసి పట్టుకోవాలి



భూమి ఉన్న ప్రతి రైతు వాన నీటిని ఒడిసి పట్టుకుంటేనే భవిష్యత్తు ఉంటుంది. నేను సొంత ఖర్చులతో ఇంకుడు గుంతలు, కందకాలు తవ్వించుకున్నాను. ఇప్పుడు ఎండాకాలంలో కూడా తోటలకు, ఇతర పంటలకు నీటి సమస్య అనేదే లేదు. ప్రభుత్వాలు కూడా ఈ దిశగా రైతులకు సహాయ సహకారాలు అందించాలి. – పాల్వాయి సత్యనారాయణరెడ్డి, రైతు, బంగారిగడ్డ

రైతులు సద్వినియోగం చేసుకోవాలి



ఉపాధి హామీ పథకం ద్వారా చాలా మంది రైతులు తమ భూముల్లో ఇంకుడు గుంతలు, కందకాలు తవ్వించుకుంటున్నారు. ఈ సంవత్సరం వేసవిలో చండూరు మండలంలో దాదాపు 50 మంది రైతులు ఇంకుడు గుంతలు, కందకాలు తవ్వించుకున్నారు. మిగతా రైతులు కూడా సద్వినియోగం చేసుకోవాలి. – శ్రీనివాస్, ఉపాధి హామీ ఏపీఓ

విజయవిహార్‌లోని గదుల అద్దె పెంపు

- గతంలో కంటే 30 శాతం పెరుగుదల



సాగర్‌లోని విజయవిహార్ అతిథి గృహం

నాగార్జునసాగర్: నాగార్జునసాగర్ జలాశయ తీరంలోని విజయవిహార్ అతిథి గృహంలో పర్యాటకులు బస చేసే గదులకు అద్దెలను భారీగా పెంచారు. పెంచిన ధరలు ఈ నెల 5వ తేదీ నుంచి అమల్లోకి వచ్చినట్లు తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ ఉత్తర్వులిచ్చింది. సాగర్ డ్యాం నిర్మాణ సమయంలో నిర్మించిన ఈ అతిథి గృహంలో బస చేసే పర్యాటకులకు వెనుక భాగంలో జలాశయం వ్యూ కనబడుతుంటుంది. ఈ అతిథి గృహంలో ఎంతో మంది రాజకీయ నాయకులు బస చేశారు. ఎందరో సినీ నిర్మాతలు, గేయ రచయితలు, దర్శకులు కథలతో పాటు సినిమా పాటలు రాసుకునేందుకు ఇక్కడికి వచ్చి వారాల తరబడి ఇందులో బస చేస్తుంటారు. ఇరవై ఏళ్ల క్రితం ఒకసారి ఈ భవనానికి మరమ్మతులు చేశారు. తిరిగి తెలంగాణ రాష్ట్రం ఏర్పాటయ్యాక 2015లో అప్పటి సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో తెలంగాణ ఎమ్మెల్యేలకు ఇక్కడ వారం రోజుల పాటు శిక్షణ ఇచ్చారు. ఆ సమయంలో కేవలం ఫర్నీచర్, ఏసీలను మార్చారు. తిరిగి 2024 చివరలో మరమ్మతులు చేసేందుకు అంచనాలు తయారు చేసి రూ.5కోట్ల నుంచి రూ.15 కోట్ల మేర ఖర్చు చేయాలని నిర్ణయించి తొలి దశలో రూ.5కోట్లకు టెండర్లు పిలిచారు. ఇటీవల ప్రపంచ సుందరీమణులు నాగార్జునసాగర్‌కు వచ్చిన సందర్భంగా పనులను వేగవంతం చేసి ముందుగానే ఆధునీకరణ పనులు పూర్తిచేశారు. పాత భవనం కావడంతో స్లాబుకు మరమ్మతులతో పాటు టైల్స్, మార్బుల్ బండలు వేశారు. రంగులతో పాటు గదుల ముందుగల లాన్లలో తివాచీ గడ్డిని పరిచారు. సూట్ రూములలో కొత్త మంచాలతో పాటు బెడ్స్‌ను మార్చారు. సూట్ రూములలో ఫైవ్ స్టార్ హోటల్స్‌ను తలపించేలా ఏర్పాట్లు చేశారు. విదేశీయులు సైతం బస చేసేవిధంగా ఆధునీకరించినట్లు పర్యాటక శాఖ అధికారులు తెలిపారు.

30 శాతానికి మించి పెరిగిన అద్దె..

విజయవిహార్‌లో మూడు రకాల భవనాలు ఉంటాయి. అత్యంత విలాసవంతమైన విజయవిహార్ భవనంలో 10 సూట్ రూములు ఉంటాయి. ఈ రూములకు గతంలో సోమవారం నుంచి శుక్రవారం వరకు అద్దె రూ.3472 ఉండగా, శని, ఆదివారాల్లో రూ.4200గా ఉండేది. ఇప్పుడు సోమవారం నుంచి శుక్రవారం వరకు జీఎస్టీతో కలిపి రూ.4,704 ఉండగా, శని, ఆదివారాలలో రూ.5,600గా నిర్ణయించారు. అదేవిధంగా సరోవర్ భవనంలో 8 డీలక్స్ రూములు ఉంటాయి. వీటికి గతంలో సోమవారం నుంచి శుక్రవారం వరకు రూ.2600, శని, ఆదివారాల్లో రూ.3400 అద్దె ఉండేది, ఇప్పుడు సోమవారం నుంచి శుక్రవారం వరకు రూ.3,024, వారాంతంలో రూ.3,920గా అద్దె పెంచారు. సమాగమంలో 20 స్టాండర్డ్ గదులు ఉంటాయి. గతంలో సోమవారం నుంచి శుక్రవారం వరకు రూ.2016, వారంతంలో రూ.2,700 అద్దె ఉండేది. ఇప్పుడు వారం మొదట్లో రూ.2,352, శని, ఆదివారాల్లో రూ.3024గా అద్దె పెంచారు.

క్లుప్తంగా

గ్యాస్ సిలిండర్ లీకై వ్యాపించిన మంటలు



లీకైన సిలిండర్‌ను ఇంట్లో నుంచి బయటకు తీసుకొస్తున్న ఫైర్ సిబ్బంది

నకిరేకల్: నకిరేకల్ పట్టణంలోని మూసీ రోడ్డులో ఆదివారం ఓ ఇంట్లో గ్యాస్ సిలిండర్ లీకై మంటలు వ్యాపించాయి. వివరాలు.. మూసీ రోడ్డులో నివాసముంటున్న కాడింగు కొండయ్య ఇంట్లో గ్యాస్ సిలిండర్‌లో అయిపోవడంతో ఆదివారం కొత్త సిలిండర్ అమర్చారు. అనంతరం వంట చేసుకునేందుకు గాను గ్యాస్ స్టవ్ ఆన్ చేయగా.. ఒక్కసారిగా సిలిండర్ వద్ద మంటలు చెలరేగాయి. ఇళ్లంతా పొగ ఆవరించింది. చుట్టుపక్కల ఇళ్ల భయాందోళనకు గురయ్యారు. కొండయ్య ఇంట్లో నుంచి బయటకు వచ్చి ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించాడు. ఫైర్ సిబ్బంది వచ్చి మంటలను అదుపులోకి తెచ్చారు. గ్యాస్ సిలిండర్‌ను బయటకు తీసుకొచ్చారు. ఈ ప్రమాదంలో ఇంట్లోని చిన్న చిన్న వస్తువులు కాలిపోయాయని బాధితుడు కొండయ్య తెలిపాడు. నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం కొండయ్య ఇంటిని పరిశీలించి రూ.5వేలు ఆర్థికసాయం అందజేశారు.

చికిత్స పొందుతూ గీత కార్మికుడు మృతి

తుంగతుర్తి: ప్రమాదవశాత్తు తాటిచెట్టు పైనుంచి కిందపడి తీవ్రంగా గాయపడిన గీత కార్మికుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. తుంగతుర్తి మండల పరిధిలోని గానుగబండ గ్రామానికి చెందిన గీత కార్మికుడు పంజాల సోమయ్య(57) ఈ నెల 2వ తేదీన కల్లు గీసేందుకు గ్రామ పరిధిలో తాటిచెట్టు ఎక్కగా ప్రమాదవశాత్తు జారి కిందపడడంతో తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని ఉస్మానియా హాస్పిటల్ తరలించగా.. చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మృతిచెందాడు. మాజీ వార్డు సభ్యుడైన సోమయ్య భౌతికకాయానికి మాజీ ఎంపీపీ గుండాగాని కవితారాములుగౌడ్, మాజీ సర్పంచ్ రామచంద్రారెడ్డి తదితరులు నివాళులర్పించారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడి..



మధు (ఫైల్)

ఆత్మకూర్ (ఎస్)(సూర్యాపేట): రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. ఆత్మకూర్ (ఎస్) మండల కేంద్రానికి చెందిన గుణగంటి మధు(35) ఈ నెల 8వ తేదీన బైక్‌పై నెమ్మికల్ నుంచి ఆత్మకూర్ మండల కేంద్రానికి వస్తుండగా.. ఎదురుగా వచ్చిన కారు బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మధుకు తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు అతడిని సూర్యాపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. వైద్యుల సలహా మేరకు కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు.

ఉన్నతాధికారులతో విచారణ చేయించాలి

- బీఆర్‌ఎస్ రాష్ట్ర రైతు విభాగం ప్రధాన కార్యదర్శి గొంగిడి మహేందర్‌రెడ్డి



మాట్లాడుతున్న గొంగిడి మహేందర్‌రెడ్డి

యాదగిరిగుట్ట: ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ఇంట్లో పనిచేసే సైదాపురం గ్రామానికి చెందిన గంధమల్ల రవి ఆత్మహత్య చేసుకున్న ఘటనపై పోలీసు ఉన్నతాధికారులు విచారణ చేపట్టాలని బీఆర్ఎస్ రాష్ట్ర రైతు విభాగం ప్రధాన కార్యదర్శి, టెస్కాబ్ మాజీ వైస్ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. యాదగిరిగుట్ట పట్టణంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. బీర్ల ఐలయ్య ఇంట్లో గంధమల్ల రవి ఆత్మహత్యపై ప్రజల్లో అనేక అనుమానాలు కలుగుతున్నాయన్నారు. దీనిపై ఓ ప్రజాప్రతినిధిగా, ఆలేరు ఎమ్మెల్యేగా వివరణ ఇవ్వాల్సిన బాధ్యత బీర్ల ఐలయ్యకు ఉందన్నారు. ఆత్మహత్య చేసుకున్న రోజు రాత్రి రవి మృతదేహాన్ని అప్పటికప్పుడే పంచనామా చేసి, భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు. హైదరాబాద్‌లోని మినిస్టర్ క్వార్టర్స్‌లో రవి మృతిచెందాడని ప్రచారం జరుగుతుందన్నారు. లోకల్ పోలీసులతో విచారణ జరిపిస్తే సరిగ్గా చేయరని, కమిషనరేట్ పరిధిలో నిజాయితీగా ఉండే అధికారితో విచారణ చేపట్టి నిజాలు బయటపెట్టాలని రాచకొండ సీపీ సుధీర్‌బాబును కోరామన్నారు. రవి ఆత్మహత్యను పక్కదోవ పట్టించేందుకే బీర్ల ఐలయ్య, స్థానిక పోలీసులు బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కర్రె వెంకటయ్యను అక్రమంగా అరెస్టు చేశారన్నారు. శాంతియుత వాతావరణంలో కర్రె వెంకటయ్య నిరసన తెలుపుతుంటే అక్రమంగా అరెస్టు చేశారన్నారు. కర్రె వెంకటయ్యకు ఏం జరిగినా ఐలయ్య, పోలీసులే బాధ్యత వహించాలన్నారు. కురుమ సామాజిక వర్గానికి చెందిన వెంకటయ్య రాజకీయంగా ఎదగకుండా ఐలయ్య కుట్ర చేస్తున్నారన్నారు. ఐలయ్య, పోలీసుల దౌర్జన్యాలపై నియోజకవర్గ వ్యాప్త బంద్‌కు పిలుపునిస్తామని అన్నారు. ఐలయ్య ఇప్పటికైనా రవి కుటుంబానికి రూ.2కోట్ల సాయం చేయాలన్నారు. ఈ సమావేశంలో ఏఎంసీ మాజీ చైర్మన్ గడ్డమీది రవీందర్‌గౌడ్, బీఆర్ఎస్వీ జిల్లా కోఆర్డినేటర్ ప్రవీణ్‌రెడ్డి, యూత్ సెక్రటరీ విజయ్, రాజేష్‌యాదవ్, సతీష్‌గౌడ్, కుమార్, గజం అశోక్, సూరి, శ్రావణ్, వీరారెడ్డి తదితరులున్నారు.

జూదరుల అరెస్ట్

చింతపల్లి : పేకాట ఆడుతున్న ఆరుగురిని చింతపల్లి పోలీసులు అరెస్ట్ చేశారు. ఎస్ఐ ముత్యాల రామ్మూర్తి తెలిపిన వివరాల ప్రకారం.. చింతపల్లి మండల పరిధిలోని ప్రశాంతిపూర్ తండా శివారులో ఆదివారం కొందరు వ్యక్తులు పేకాట ఆడుతున్నారన్న పక్కా సమాచారం మేరకు పోలీసులు దాడి చేయగా.. ఆరుగురు వ్యక్తులు పేకాట ఆడుతూ పట్టుబడ్డారు. వారి నుంచి రెండు బైక్‌లు, నాలుగు సెల్‌ఫోన్లు, రూ.2వేల నగదు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

10 మందిపై కేసు నమోదు..

గరిడేపల్లి: గరిడేపల్లి మండలం కట్టవారిగూడెం గ్రామంలో పేకాట స్థావరంపై ఆదివారం పోలీసులు దాడి చేసి 10 మందిని పట్టుకున్నట్లు ఎస్ఐ నరేష్ తెలిపారు. మరో ముగ్గురు పరారైనట్లు పేర్కొన్నారు. వారి నుంచి రూ.42450 నగదు, 7 సెల్‌ఫోన్లు, 7 బైక్‌లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ముగ్గురి రిమాండ్

శాలిగౌరారం: భూతగాదాలో ఘర్షణ పడిన ముగ్గురిని పోలీసులు రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శాలిగౌరారం మండలం భైరవునిబండ గ్రామానికి చెందిన పులిచర్ల ముత్తయ్య, పులిచర్ల మల్లయ్య కుటుంబాల మధ్య గత సంవత్సర కాలంగా భూతగాదాలు జరుగుతున్నాయి. ఈ నెల 2న ముత్తయ్య కుమారులు వెంకన్న, శంకరయ్య తమ వ్యవసాయ బావి పనులు చేసుకుంటుండగా.. మల్లయ్య, అతడి సోదరులు పులిచర్ల రవి, పులిచర్ల రాంమ్మూర్తి అక్కడకు వెళ్లి వెంకన్న, శంకరయ్యతో గొడవపడి వారిపై కర్రలతో దాడి చేసి తీవ్రంగా కొట్టారు. ఈ దాడిలో వెంకన్న కాళ్లు విరగగా, శంకరయ్య తలకు తీవ్ర గాయాలయ్యాయి. ప్రస్తుతం వారు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ముత్తయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టిన పోలీసులు పులిచర్ల మల్లయ్య, పులిచర్ల రవి, పులిచర్ల రాంమ్మూర్తిని అరెస్ట్ చేసి శనివారం రాత్రి నకిరేకల్ జేఎఫ్‌సీఎం కోర్టులో హాజరుపర్చగా జడ్జి నిందితులను రిమాండ్‌కు తరలించాలని ఆదేశించడంతో నల్లగొండ జైలుకు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

భక్తులు దక్షిణ ద్వారం నుంచి బయటకు వచ్చేలా..

- యాదగిరిగుట్ట ఆలయంలో ప్రత్యేక ఏర్పాట్లు



దక్షిణ ద్వారం వద్ద భక్తులకు పులిహోర ప్రసాదం పెడుతున్న అర్చకులు

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహస్వామిని దర్శించుకున్న భక్తులు పశ్చిమ ద్వారం నుంచి కాకుండా దక్షిణ ద్వారం నుంచి బయటకు వచ్చేలా ఆలయ అధికారులు ఏర్పాట్లు చేశారు. భక్తులకు ప్రతిరోజు ఉచిత పులిహోర ప్రసాదం అందించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్న నేపథ్యంలో పశ్చిమ ద్వారం వద్ద భక్తులు ప్రసాదం తీసుకునేందుకు నిలిచిపోవడంతో పాటు బయటకు వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ఆలయ ఈఓ వెంకట్రావ్, ఆలయాధికారులు దక్షిణ ద్వారం వద్ద భక్తులకు ఉచిత పులిహోర ప్రసాదాన్ని పంపిణీ చేస్తూ బయటకు పంపిస్తున్నారు. పశ్చిమ ద్వారం గుండా సైతం భక్తులను పంపిస్తున్నామని, భక్తులకు ఇబ్బందులు కలుగవద్దనే ఉద్దేశ్యంతో దక్షిణ ద్వారం మార్గంలో ప్రసాదాన్ని పంపిణీ చేస్తూ మాడ వీధిలోకి పంపుతున్నామని ఆలయ డిప్యూటీ ఈఓ దోర్బల భాస్కర్ శర్మ వెల్ల డించారు.

అధికారులను అడ్డుకున్న రైతులు



అధికారులను చుట్టుముట్టిన రైతులు

చిట్యాల: మండలంలోని వట్టిమర్తి గ్రామ పరిధిలో బ్రాహ్మణ వెల్లెంల ప్రాజెక్టు కుడి కాలువ ఏర్పాటుకు సంబంధించి భూములను సర్వే చేసేందుకు ఆదివారం వచ్చిన ఇంజనీరింగ్, సర్వే అధికారులను ఆ గ్రామ రైతులు అడ్డుకున్నారు. కుడి కాలువ పరిధిలో సుమారు 30 ఎకరాల భూములను రైతులు కోల్పోనున్నారు. కాగా ఈ భూములకు ప్రభుత్వ రికార్డులో మార్కెట్ రేట్ ప్రకారం సుమారు రెండున్నర లక్షల రూపాయలు ఉండగా బహిరంగ మార్కెట్‌లో కోటి రూపాయల వరకు విలువ ఉంటుంది. దీంతో రైతులు తమకు బహిరంగ మార్కెట్ రేట్ ప్రకారం పరిహారం ఇవ్వాలనే డిమాండ్‌కు అధికారులు అంగీకరించకుండా సర్వే చేయడానికి డీఈ శ్రీనివాస్, ఏఈ రాజశేఖర్‌రెడ్డి, సర్వేయర్ రజనీకాంత్‌లను అడ్డుకున్నారు. దీంతో సర్వే చేయడానికి వచ్చిన అధికారులు వెనుదిరిగారు. కార్యక్రమంలో ఆ గ్రామ రైతులు నర్రా మోహన్‌రెడ్డి, నర్రా భిక్షంరెడ్డి, అక్కెనపల్లి యాదగిరి, నర్రా లవేందర్ రెడ్డి, దూదిగామ స్వామి, దూదిగామ మల్లయ్య, పాలాల యాదయ్య, మేడి వీరస్వామి, నర్రా శ్రీకాంత్‌రెడ్డి, లెంకల సత్తిరెడ్డి పాల్గొన్నారు.

కారును ఢీకొట్టిన ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు

- ఇద్దరికి గాయాలు

చౌటుప్పల్: కారును వెనుక నుంచి ట్రావెల్స్ బస్సు ఢీకొట్టడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ ఘటన చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని లక్కారం గ్రామం వద్ద ఆదివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌లోని వనస్థలిపురం ప్రాంతానికి చెందిన భూక్యా మహేష్, అతడి స్నేహితులు గోపు అనూష, గజ్జల గోపాలకృష్ణ, తన్మయి కలిసి కారులో ఏపీలోని విజయవాడ కనకదుర్గ అమ్మవారి దర్శనం నిమిత్తం శనివారం రాత్రి బయల్దేరారు. మార్గమధ్యలో చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని లక్కారం గ్రామంలోని ఎస్ఎంఆర్ ఫంక్షన్‌హాల్ వద్ద అతివేగంగా వచ్చిన ట్రావెల్ బస్సు వెనుక నుంచి కారును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారులో ఉన్న తన్మయి, గోపాలకృష్ణ గాయపడ్డారు. భూక్యా మహేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మన్మథకుమార్ తెలిపారు.

ప్రతిఒక్కరూ ధర్మాన్ని పాటించాలి



కలశ పూజ, హోమంలో పాల్గొన్న ఆశ్రమ ప్రధాన శిష్యులు, భక్తులు

హుజూర్‌నగర్ (చింతలపాలెం) : ప్రతిఒక్కరూ ధర్మాన్ని పాటించాలని శ్రీరామదూత స్వామి ఆశ్రమ ప్రధాన శిష్యులు కుమారస్వామి, పూర్ణానంద దీక్షితులు, పవిత్రమ్మ, శిరీషమ్మ అన్నారు. ఆదివారం చింతలపాలెం మండలంలోని గుడిమల్కాపురం గ్రామంలో శ్రీ వేణుదత్త సువర్ణ లక్ష్మీ దాంపత్య వ్రతం, కలశపూజ, హోమం జరిపించారు. జూలై 10న గురు పౌర్ణమి సందర్భంగా హైదరాబాద్‌లోని శ్రీ రామదూత స్వామి దివ్యధామంలో 120 హోమ గుండాలతో అభీష్టసిద్ధి మహాయజ్ఞం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో నాగిరెడ్డి దంపతులు, చక్రారెడ్డి, శంబిరెడ్డి, కోటి, శంకరాచారి, శ్రీదేవి, నాగమణి పాల్గొన్నారు.

వికసించిన బ్రహ్మ కమలం



బ్రహ్మ కమలం చూపుతున్న మంజుల

నల్లగొండ టూటౌన్: నల్లగొండ పట్టణంలోని అలకాపురి కాలనీకి చెందిన ఇడుకుల్ల మంజుల పద్మాకర్ నివాసంలో ఆదివారం రాత్రి బ్రహ్మ కమలం వికసించింది. ఇలాంటి మొక్కలను ఆలయాల్లో మాత్రమే పెంచుతుంటారు. ఇవి రాత్రి సమయంలో మాత్రమే వికసించి గంట మాత్రమే ఉంటాయి. ఈ బ్రహ్మ కమలం ఉత్తరాఖండ్ రాష్ట్రానికి చెందిన పుష్పంగా చెబుతుంటారు.

కొనసాగుతున్న వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు



ఉత్సవమూర్తులను యాగశాలకు తీసుకొస్తున్న అర్చకులు, ఆలయ కమిటీ సభ్యులు

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్‌లో గల గోదాదేవి, పద్మావతి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. ఆదివారం ఆలయంలో అగ్నిప్రతిష్ఠ, శాంతిపాఠం, గరుడ హోమం, చతుస్థానార్చన, ధ్వజారోహణం నిర్వహించారు. అనంతరం సూర్యప్రభ, చంద్రప్రభ వాహన సేవ, ఎదుర్కోళ్లు, మంగళ నీరాజనం, మంత్రపుష్పం గావించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు, ఉత్సవాల నిర్వహణ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

సారవంతమైన నేలల్లో అధిక దిగుబడులు

- కంపాసాగర్ కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ శ్రీనివాసరావు సూచనలు

పాడిపంట



వర్మీ కంపోస్టు ఎరువు సంచులు

త్రిపురారం: సారవంతంగా నేలలు ఉంటేనే చీడపీడల ఉధృతిని తగ్గించుకోవచ్చని కంపాసాగర్ కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే) ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీనివాసరావు చెబుతున్నారు. రైతులు రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి, శాస్త్రీయ పద్ధతుల్లో నేలలను సారవంతం చేసుకోవాలని ఆయన సూచిస్తున్నారు. నేలలను సారవంతం చేసుకోవడానికి ఆయన సలహాలు, సూచనలు ఇవీ..

గొర్రెల మందలతో అధిక ప్రయోజనాలు

నేలలను సారవంతంగా చేసుకోవడానికి గొర్రెల ఎరువు ఎంతగానో ఉపయోగపడుతుంది. ఇతర ప్రాంతాల నుంచి గొర్రెల కాపరులు మేత కోసం గ్రామాలకు వస్తుంటారు. ఒక్కో గొర్రెల మందలో సుమారు 150 నుంచి 500 వరకు గొర్రెలు ఉంటాయి. రైతులు గొర్రెల కాపరులతో మాట్లాడుకుని ఎకరానికి కొంత చొప్పున చెల్లించి గొర్రెల మందలను తమ పొలంలో రాత్రి సమయంలో ఉండేలా చూసుకోవాలి. ఉదయం నుంచి మేత మేసిన గొర్రెలు రాత్రి సమయంలో పెంట రూపంలో పొలంలో వదులుతాయి. అలా గొర్రెల పెంటను నేలలో కలియ దున్ని దమ్ము చేసుకుంటే నేల సారవంతంగా తయారవుతుంది.

వర్మీ కంపోస్టుతో నేల సారవంతం..

వర్మీ కంపోస్టు నిస్సారమైన భూమిని సారవంతంగా మారుస్తుంది. రసాయనిక ఎరువుల ద్వారా భూమిలో ఇంకిపోయిన భాస్వరం, పొటాషియం, నత్రజనిని తిరిగి పంటలకు ఉపయోగపడేలా చేస్తుంది. పంటలకు కావాల్సిన సూక్ష్మపోషకాలు, మధ్య పోషకాలు, జింక్ పూర్తిస్థాయిలో లభిస్తుంది. పైర్లకు చీడపీడలను తట్టుకునే శక్తిని ఇస్తుంది. ఈ ఎరువులో తేమ శాతం ఎక్కువగా ఉండడం వల్ల నీటి వాడకాన్ని తగ్గించుకోవచ్చు. ఎకరానికి 500 కేజీల వర్మీ కంపోస్టు వేసుకోవడం ఉత్తమం.

వర్మీ కంపోస్టు తయారు చేసుకునే విధానం..

వర్మీ కంపోస్టు తయారీకి అవసరమైన తొట్టెలను నిర్మించుకోవాలి. ఈ తొట్టెల్లో వరి గడ్డి ఒక లేయర్‌గా వేసుకోవాలి. లేయర్‌పై ఆరబెట్టిన పేడను వేసుకొని దానిపై తడిచెత్తను వేసుకోవాలి. అలాగే మూడు రోజులు మగ్గిన తర్వాత వానపాముల సీడ్‌ను వేయాలి. అనంతరం జీవామృతం పోసుకొని స్ప్రేయర్ ద్వార నీళ్లు చల్లుతూ ఉండాలి. 20 నుంచి 30 రోజుల్లో వానపాములు పూర్తిస్థాయిలో ఉత్పత్తవ్వడం ద్వారా ఓ మిశ్రంలా మారుతుంది. పై భాగంలో ఉన్న మిశ్రమాన్ని జల్లించి ఆరబెట్టడం ద్వారా వర్మీ కంపోస్టు తయారవుతుంది. పై భాగంలో మిశ్రమాన్ని తీసిన ప్రతిసారి జీవామృతం పోస్తూ మగ్గబెట్టుకోవాలి. ఇలా తొట్టెల్లోని మిశ్రమాన్ని పూర్తిగా ఉపయోగించిన తర్వాత తిరిగి తయారీ ప్రారంభించుకోవాలి.

జీవ ఎరువుల వినియోగం..

గోమయం, పంచగవ్య, గ్రీన్ మాన్యుర్, జీవామృతం వంటి జీవ ఎరువులను వినియోగించి భూసారం కాపాడుకోవచ్చు. జీవ ఎరువులు పంటలకు పోషకాలు అందించి మట్టిని ఆరోగ్యంగా ఉండేలా చూస్తాయి. మట్టిలో ఉండే సూక్ష్మజీవులకు ఆహారాన్ని అందిస్తాయి. మట్టిలో సేంద్రియ పదార్థాలను పెంచి పైర్ల గాలితో పాటు నీటి నిల్వ సామర్థ్యాలను పెంచుతాయి. పంటలకు నెమ్మదిగా పోషకాలు అందిస్తాయి.

పచ్చిరొట్టతో ఉపయోగాలు

పచ్చిరొట్ట ఎరువులైన జనుము, జీలుగ, పిల్లిపెసర, ఉలవ, అలసందను ప్రధాన పంటల సాగుకు ముందు సాగు చేసి కలియ దున్నుకోవాలి. పచ్చిరొట్ట ఎరువుల్లో సేంద్రియ పదార్థం ఉంటుంది. సూక్ష్మజీవులు విస్తారంగా వృద్ధి చెంది భూసారం పెరుగుతుంది. భూమి గుల్లబారి నీటి నిలువ శాతం పెరిగి సులభంగా నీరు, గాలి వేర్లకు అందుతుంది. సూక్ష్మపోషక పదార్థ లోపాలు రాకుండా ఉంటాయి. పచ్చిరొట్ట పైర్లు భూమిలో కుళ్లేటప్పుడు రసాయనిక ప్రక్రియలు జరిగి మొక్కలకు పోషక పదార్థాలు అందుతాయి.